# కార్తీక పూర్ణిమ ఎంత గొప్పదో!



కార్తీక పూర్ణిమ
27.11.2023

కృత్తిక+పూర్ణిమ అనే రెండూ కలిస్తే ఆ మాసం కార్తికం అవుతుంది. కృత్తికా నక్షత్రం అగ్ని ప్రధానమైనది (కృత్తికాగ్నిర్దేవతా).పూర్ణిమా తిథి 16 కళలతో కన్పించే చల్లని చంద్రునితో ఉండేది.

ఇటు వేడిమీ అటు చల్లదనమనే రెండూ కలిసిన రోజు ఇది. అయ్యవారి మూడవకన్ను అగ్నినేత్రం. అమ్మవారు చల్లదనానికి ప్రతీక. అందుకే శంకరుడు దహించివేసిన మన్మథుణ్ణే బతికించిందామె.

ఈ అగ్నీ, ఆ చల్లదనమూ కలిసి అర్ధనారీశ్వరు లుగా కన్పించే ఆ రూపానికి నేటి ఉదయకాలంలో చక్కని అభిషేకాన్ని చేయాలి. 'ప్రథమో దైవ్యో భిషక్' (మొదటి వైద్యుడు శంకరుడు) అన్నారు కాబట్టి ఈ నెలలో కలగబోయే వ్యాధుల్ని రాకుండా చేయవల సిందని ఆ జంటని ప్రార్థించాలి. ఇది ప్రథమ కర్తవ్యం. ఇక ఈనాటి రాత్రి 11 గంటలకి స్వచ్ఛమైన ఆవు పాలని మేడమీద గిన్నె మూతని తెరిచి ఆ పూర్ణిమ చంద్రుని కిరణాలు ఆ పాలలో పడేలా చేసి, సరిగ్గా 12 గంటలకి ఆ పాలని పూర్తిగా మరిగించాలి.

తాగ వీలయినంత వేడిమికొచ్చాక మిరియాల పొడిని కలిపి ఆ మిశ్రమాన్ని గనుక తాగినట్లయితే ఈ సమయంలో తాగిన ఆ ఔషధం కారణంగా ఓ ఏడాదిపాటు శ్వాసకోశ వ్యాధులు రావు. అనుభవంలో ఎందరో తెలుసుకుని ఆచరిస్తున్న సత్యం.

కృత్తిక పూర్ణిమల్లో వేడిమీ చల్లదనం, అటు అర్ధ నారీశ్వర రూపంలో వేడిమీ చల్లదనం, ఇటు చల్లని పాలలో చంద్రుని చల్లదనం దాన్ని కాచగా వచ్చిన వేడిమితనం, ఇటు శరీరంలో ఉన్న వేడిమి కారణంగా వచ్చిన చల్లదనంవంటివి గమనిస్తే ఎంత భిన్న ప్రకృ తులు రెండూ ఒకట్రైనతనం కనిపిస్తుందో ఆ విశేషం ఆశ్చర్యాన్ని కలగజేస్తుంది.

## వృషోత్సర్జనం

వృషమంటే ఎద్దు.ఉత్సర్జనం అంటే విడిచెయ్యడం అని అర్థం. చల్లనిదనం సహజంగా ఉంటూ వేడిమి తనంకూడా ఉన్న ఈ కాలం గర్భధారణకిఅనువైన సమయం. అందుకే బాగా గమనిస్తే దంపతులు ఎక్కువమందికి సంతానానికి సంబంధించిన సూచన (స్త్రీలు నెలతప్పడమనేది) కలిగేది ఈ కార్తిక మాసం లోనే. చలికాలంలో గర్భధారణ జరిగితే సంతానం ఆరోగ్యవంతులుగా ఉంటారు.

ఇటు మనుష్య జాతికే కాకుండా అటు గోసంతతి కూడా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ఋషులు- వృషాన్ని (బాగా బలంగా ఉన్న ఎద్దుని) దాని పృష్ఠం మీద గుండ్రని ఇనుపచక్రాన్ని కాల్చి అచ్చువేసి లోకం లోకి స్వేచ్ఛగా విడిచిపెడతారు. అంటే- ఆ ఎద్దు గాని ఒకవేళ ఎవరి చేలో దిగినాకూడా దాన్ని కొట్టడం, బందెలదొడ్డిలో పెట్టి యజమానికి జరిమానా విధించ డంవంటివి ఉండవన్నమాట.

ఆ ఎద్దు ఎన్నో ఆవులకి గర్భధారణ కలిగేలాచేసి లోకంలో అనేక గోవుల్నీ, ఎద్దుల్నీ కంటూ మళ్ళీ ఈ గ్రామస్థులకే పాడీ, పంటలకీ లోటు లేకుండా చేస్తుం దన్నమాట. అందుకే ఆబోతుని విడిచిపెట్టబోయే ముందు పెద్దపూజనిచేసి దానికి అలంకారాలనిచేసి నమస్కరించి మరీ విడిచిపెడతారు.

ఈ రోజుల్లో కృత్రిమ పద్ధతుల్లో గర్భాన్ని కలి గిస్తున్నారు. దానికి కృత్రిమంగా ఉత్సాహం కలిగేలా సూది మందునిచ్చి సంతానాన్ని కలిగించేలా చేస్తు న్నారు. ఆనాటి పద్ధతిలోమాత్రం ఎద్దుకి సహజంగా కలిగిన కామప్రేరణతోమాత్రమే గర్భధారణని గోవుకి కలిగేలా చేస్తూండేదికాబట్టి సహజ సంతానం బలిష్ఠ సంతానం ఆరోగ్యకర సంతానం కలుగుతూండేది- అలాటి గోవు ఎక్కువ పాలనికూడా ఇస్తూండేది.

నాటి ఆవుపాలకుండే ఔషధీశక్తి జెర్సీ ఆవుపాలకి ఉండదు. అందుకే యథార్థ సన్యాస ధర్మంతో ఉండే వాళ్ళు నాటు ఆవుల్నే ఆశ్రమాల్లో పెంచుకుంటూ ఆ పాలనే శివాభిషేకానికి వినియోగిస్తూ ఆ పాలనే ఉపయోగించుకుంటూ ఉంటారుకూడా.

ఇది ద్వితీయ కర్తవ్యం ఈ రోజున.

చక్కని పాలని సరిగా తోమని గిన్నెలోపోసి వేడిచేస్తే ఎలా ఆ పాలు విరిగిపోతాయో అలా విజ్ఞానమనేది కూడా సరైన వ్యక్తులకి-సత్ జనులకిమాత్రమే చేరితే ఆ విజ్ఞానమనేది లోకక్షేమానికి ఉపయోగపడుతుంది.

అలాకాక పవిత్రమైన గొప్పదైన విజ్ఞానం కాస్తా దుర్బుద్ధిగలవాళ్ళ పాలపడితే లోకం మొత్తం నాశన మవుతుంది కదా! ఈ రోజున సోమకుడనే రాక్షసు డొకడు- వేదాల గొప్పదనాన్ని గ్రహించి, వాటిలో సకలలోకాల చర-అచర, ప్రాణి-అప్రాణి, రోగ-వైద్య, ఆచార అనాచార, దోష శిక్షలకి... సంబంధించిన విశేషాలన్నీ ఉన్నాయని గ్రహించి- అకస్మాత్తుగా ఆ వేదాలని అపహరించుకుపోయాడు.

దుర్మార్గులూ లోకాన్ని పీడించి తమ ఆధిపత్యంతో ఉపద్రవాల్ని సృష్టించాలనే దృక్పథంకల్గిన ఆ రాక్షసుని



చేతిలో అలాగే రాక్షసులందరి చేతిలోనూ ఈ వేద విజ్ఞానమేగాని పడినట్లయితే లోకమంతా నాశనమవుతుందని భావించిన శ్రీహరి మత్స్య (చేప) అవతారాన్నెత్తాడు మరుక్షణంలో.

వేదాలని అపహరించిన రాక్షసుడు చేపరూపంలో సముద్రంలోకి వెళ్ళిపోయాడని గమనించిన శ్రీహరి తానుకూడా పెద్దచేపగా ఆ సముద్రంలోనికే ప్రవేశించాడు. సముద్రంలో అనేక కోట్ల చేపలు భిన్నభిన్న రూపాలతో లక్షణాలతో రంగురంగు శరీరాలతో ఉంటాయి కాబట్టి తనని పట్టుకోవడం శ్రీహరికి సాధ్యం కాదనుకున్నాడు సోమక రాక్షసుడు.

శ్రీహరికున్న వేయినామాల్లోనూ ఒకటి 'మేధావి' అని కదా! ఆ కారణంగా- కొత్తగా చేపరూపాన్ని అప్పటికప్పుడు ధరించిన ఈ సోమకుడనే రాక్షసునికి చేపకుండే సహజ లక్షణాలు ఉండవే ఉండవని భావించి, చేపగా కన్పిస్తూ చేప సహజ లక్షణాలు లేని ఈ చేప రూప రాక్షసుణ్ణి క్షణాల్లో వధించి వేదాలని తిరిగి బ్రహ్మాకి అప్పగిస్తూ 'ముఖ్యమయిన వస్తువు విషయంలో పరాకుతనం పనికిరాదంటూ ఓ మందలింపుని కూడా చేశాడు శ్రీహరి.

## పాంచరాత్ర ఆగమాలు

శ్రీహరేగాని రక్షించి ఉండని పక్షంలో వేదవిజ్ఞాన రహస్యాలన్నీ ముష్కరుల చేతిలోపడి మనకంటూ ధర్మబద్ధమైన నియమాలూ విజ్ఞాన విశేషాలూ ఆచార వ్యవహారాలూ... ఇలా ఉండేవి కానే కావు.

ఈ వేదాలు ఇలా దొంగిలింపబడి తిరిగి బ్రహ్మ వద్దకి చేరేనాటికి 5 రాత్రుల కాలం జరిగింది. ఆ 5 రాత్రుల కాలంలో పూజాపురస్కారాలూ, యజ్ఞయాగాదులూ జరుపబడడానికి వీలుగా వేదవిశేషాలు చెప్పబడ్డాయి.వాటినే పాంచరాత్ర ఆగమాలు (5 రాత్రుల్లో ప్రత్యామ్నాయంగా చెప్పబడ్డవి) అన్నారు.

## జ్వాలాతోరణం

పాలసముద్రాన్ని దేవతలూ, రాక్షసులూ కలిసి చిలుకుతూంటే చెప్పలేని వేడిపొగలతో హాలాహలమనే విషం బయటకొచ్చింది. శ్రీహరితో సహా అందరూ పారిపోగా పార్వతీదేవి శంకరుణ్ణి చూస్తూ

'మ్రింగెడివాడు విభుండని-మ్రింగెడిదియు
గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనే సర్వమంగళ-మంగళసూత్రంబు
నెంత మది నమ్మినదో!'

"అందరూ వెళ్ళిపోతే నువ్వేమిటలా చూస్తున్నావు! స్వీకరించు ఆ విషాన్ని. లేని పక్షంలో ఆ విషం లోకాలన్నిటినీ దహించి, పొగలతో ఎవరెవరికీ కన్పించని రీతిలో చేసేస్తుం'దన్నది. భార్యాప్రియుడైన శంకరుడు ఆ విషాన్ని అలా గుటుక్కున మింగేశాడు.

ఆ విష తీవ్రతకి శంకరుడు మాగన్ను వేస్తూంటే పార్వతి ఆయన కంఠాన్నిపట్టి ఆ విషం ఆయన ఉదరంలోనికి పోకుండా చేసింది. దాంతో శంకరుని కంఠం నీలం (ఆకాశపు రంగు)గా మారింది. అందుకే ఆయన్ని నీలకంఠుడని పిలుస్తారు.

ఆ సందర్భంలో పార్వతీదేవి నిజానికి జగజ్జననే అయినా భర్త ప్రాణాల విషయానికొచ్చేసరికి- అగ్నిదేవునికి మొక్కుకుంది-'అగ్నిదేవా! నా భర్తని నీ వేడిమితో దహించివేయకు! ప్రతి కార్తిక పూర్ణిమనాడూ తప్పక నీకు నా భర్తతో కలిసి ముమ్మారు ప్రదక్షిణం చేస్తా'నని. దాంతో అగ్ని చల్లబడ్డాడు.

ఆ మొక్కు తీర్చుకునేందుకు కార్తిక పూర్ణిమనాడు జ్వాలాతోరణమనే ఉత్సవాన్ని శివాలయంలో చేస్తుంటారు. దూరం దూరంగా రెండు స్తంభాలని పాతి ఆ రెంటికీ మధ్యలో ఎండుగడ్డితో చేసిన తాడు (వెంటి అంటారు)ని కట్టి రెండు స్తంభాలకి మధ్యనున్న ఆ వెంటికి నిప్పంటిస్తారు. శివపార్వతుల విగ్రహాలని ముమ్మారు ఆ అగ్నికి ప్రదక్షిణాకారంగా తిప్పుతారు. దీన్నే 'జ్వాలాతోరణ'మంటారు.

ఈ సందర్భంగా నేలనపడిన ఆ నల్లనిగడ్డి మసిని ముత్తైదువులు ఉదరానికి రాసుకుంటారు సంతాన ప్రాప్తికోసం. రైతులు తమ పొలాల్లో చల్లుకుంటారు ధాన్యాభివృద్ధికోసం. భక్తులు నుదుటికి రాసుకుంటారు అపమృత్యువులేకుండా-ఆ దోషం రాకుండా.

ఇదంతా ఆధ్యాత్మిక రహస్యం.

## లౌకిక విశేషం

చక్కనైన చిక్కనైన చలికి వ్యక్తులందరికీ హానిని కల్గించే కన్పించే-కన్పించని-అతిసూక్ష్మ క్రిమికీటకాలెన్నో ఈ మంటలకి ఆకర్షింపబడి తమకి తామే ప్రాణాలని పోగొట్టుకుంటాయి.

దేవాలయానికి వచ్చేటువంటి భక్తుల సంఖ్య మరింతగా ఉంటుందికాబట్టి అక్కడికి వచ్చేవారికి వ్యాధులు లేకుండా చేయడము అనేది మరింత ముఖ్యంకాబట్టి అటు అలౌకికంగా జ్వాలాతోరణం-ఇటు లౌకికంగా వ్యాధి నివారణం చేయించడము జరుగుతుందన్నమాట దీనిద్వారా.

ఇంకా ఎన్నో విశేషాలున్నా-కొండ అనేదాన్ని అద్దంలో చూపించినట్టు- చూపడం ఇక్కడ జరిగిందనీ, ఈ స్ఫూర్తితో మరెన్నో విశేషాలని మనం తెలుసుకునే ప్రయత్నాన్ని చేయాలనీ గమనించాలి మనం!

డా॥ మైలవరపు శ్రీనివాసరావు